క్లుప్తంగా

నేడు గోదారంగనాథ స్వామి కల్యాణం

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీ హరిహర క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా గోదా రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సురేష్ నాయుడు తెలిపారు. శనివారం ఉదయం 11గంటలకు స్వామివారి కల్యాణం, అనంతరం అన్నసమారాధన ఉంటుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు జిల్లా పరిషత్ పాఠశాలకు శంకుస్థాపన

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీలోని రమ్యాగ్రౌండ్స్‌లో నిర్మించనున్న నందమూరి తారక రామారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శంకుస్థాపనను శనివారం ఉదయం 8.30 గంటలకు నిర్వహించనున్నట్లు కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస రావు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ హరీష్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీలతో పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

శబరిమలలో పంచగిరీశ భక్త సమాజం పాటలు



కూకట్‌పల్లి: కూకట్‌పల్లికి చెందిన పంచగిరీశ భక్త సమాజం వారు శుక్రవారం శబరిమలలోని సన్నిధానం వద్ద భక్తి పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో శేఖర్ స్వామి, రామకృష్ణస్వామి తదితరులు భక్తి పాటలు పాడి అందరి మనస్సులు గెలుచుకున్నారు.

పరామర్శ

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు ఆవుల సంజీవ మాతృమూర్తి ఆవుల మల్లమ్మ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సంజీవ నివాసానికి వెళ్లి మల్లమ్మ పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు మహమ్మద్ గౌసుద్దీన్, తూము శ్రావణ్‌కుమార్, సత్యనారాయణ, సత్యంగంగపుత్ర, లింగాల ఐలయ్య, అంబటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభానికి మరమ్మతులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడ ప్రధాన రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని విద్యుత్ స్తంభం విరిగింది. ఈ విషయాన్ని స్థానికులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన శుక్రవారం విద్యుత్ స్తంభాన్ని పరిశీలించి తక్షణమే స్తంభాన్ని మార్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

ఓక్రిడ్జ్‌లో టీఈడీఎక్స్ కార్యక్రమం



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న నాన్ జోషి

దుండిగల్: బాచుపల్లిలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం 'రిప్పల్స్'నేపథ్యంలో టీఈడీఎక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటి దివి వాద్యా, ట్రాన్స్‌జెండర్ హక్కుల కార్యకర్త నాన్ జోషి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దివి మాట్లాడుతూ.. తాను నటిగా మారానుకున్నప్పుడు సానుకూల, ప్రతికూల ప్రభావాలుంటాయని ముందే ఊహించానన్నారు. ఎన్ని ప్రతికూలతలు ఎదురైనా ధైర్యంగా వాటిపై విజయం సాధించానన్నారు. అనంతరం నాన్ జోషి మాట్లాడుతూ... తన చిన్నతనం ఎంతో సరదాగా గడిచిపోయిందని, రాను రాను తనలో వచ్చిన మార్పుల నేపథ్యంలో ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోనాల్సి వచ్చిందన్నారు. వాటన్నింటిని అధిగమించి మిస్ వరల్డ్ డైవర్సిటీ పోటీల్లో భారత దేశం తరఫున పాల్గొని మూడుసార్లు అందాల రాణిగా నిలిచానన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బల్జీత్ ఒబెరాయ్ ఈవెంట్ కో.ఆర్గనైజర్ స్వర్ణ దయానా, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గోదాదేవి కల్యాణం

- ఆలయంలో నిత్యం స్వామివారి కల్యాణం
- అన్నదానాలు, ప్రత్యేక పూజలు



గర్భాలయంలో మూలవిరాట్



మూసాపేట: కూకట్‌పల్లి రంగనాయక చెరువు సమీపంలో 800ఏళ్ల సంవత్సరాల క్రితం స్వామివారు స్వయంభూగా వెలిశారు. గుడి గర్భాలయ నిర్మాణం కూడా రాతి కొండలే గోడలుగా నిలిచాయి. కొండపైన గోపురం నిర్మించారు. పక్కనే పాపనాశేశ్వర స్వామి ఆలయం ఉంది. రెండు దేవాలయాలను పాపన్న, రంగన్నగా పిలుచుకుంటారు. పక్కనే ఉన్న చెరువులోని నీటిని గతంలో కొన్ని సంవత్సరాల కిందట స్వామివారి అభిషేకానికి వాడారంట. అలా రంగనాథ చెరువుగా ప్రసిద్ధి చెందింది.

అద్దంలోనే స్వామి దర్శనం...

◆ గర్భాలయంలో రాతికి శ్రీరంగనాయక స్వామి వారు తూర్పు వైపు తిరిగి ఉంటారు. ఆలయ ద్వారం నిత్యం ఉత్తర ద్వారంగా ఉంటుంది. ఆలయంలోకి వెళ్లిన భక్తులకు స్వామివారు నేరుగా కనిపించరు. అద్దంలోనే స్వామివారిని దర్శనం చేసుకోవాలి.

ఆలయ విశిష్టత...

◆ గతంలో ఆలయంలో 12 అడుగుల నాగుపాము ఉండేదని, అర్చకులు ఆలయం తెరిచినప్పుడు లోపలికి వెళ్లి పూజలు ముగిసి అర్చకుడు బయటికి వెళ్లినప్పుడు నాగుపాము బయటకు వచ్చేదని చెబుతుంటారు. గర్భాలయంలో స్వామివారిని చుట్టుకొని ఉండేదని భక్తులు ఇప్పటికీ చెబుతారు. కొన్నాళ్లకు 1981లో నాగుపాము చనిపోవడంతో ఆలయ ఆవరణలో దహనం చేశారు. అక్కడే శివలింగాన్ని ప్రతిష్ఠించారు. సుబ్రహ్మణ్య స్వామిని కూడా ప్రతిష్ఠించారు.

◆ స్వామివారు నాగశేషుడిపై శయనిస్తున్నట్లుగా ఉండగా పాదాల వద్ద శ్రీదేవి సమేతుడై నాభి నుంచి పద్మంపై బ్రహ్మ దేవుడు, మత్స్య, కూర్మ, రామ దశావతారాలతో స్వామివారు దర్శనం ఇస్తుంటారు. ప్రతి శనివారం వందలాది మందికి అన్నదానం చేస్తున్నారు.

◆ శ్రీరామనవమి, వార్షికోత్సవాలు, ధనుర్మాసం ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఐడీఎల్ కంపెనీ కార్మికులు, కంపెనీ యాజమాన్యం సమక్షంలో ఆలయంలో నిత్యం పూజలు, ఉత్సవాలు, అన్నదానాలు జరుగుతున్నాయి.

ధనుర్మాస ప్రత్యేక పూజలు...

◆ ధనుర్మాసం సందర్భంగా ఆలయంలో 14న గోదా రంగనాయక స్వామి కల్యాణం అనంతరం అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



నాగశేషుడిని దహనం చేసిన చోటనే శివలింగాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

జేఎన్‌టీయూహెచ్‌లో దిగజారుడు రాజకీయాలు ఆపాలి

రిజిస్ట్రార్‌కు బంజరా విద్యార్థి సంఘం నాయకుల వినతి

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో జరుగుతున్న నీచమైన దిగజారుడు రాజకీయాలు ఆపాలని, ఎస్టీ బంజారా ప్రొఫెసర్స్‌ని టీఎస్ హెచ్‌ఈసీ చైర్మన్‌గా నియమించినందుకు కొంతమంది అక్కసుతో వారికి అనుభవం లేదని దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శుక్రవారం రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్‌కు బంజారా విద్యార్థి సంఘం అధ్యక్షుడు లకావత్ భానుప్రకాష్ నాయక్ వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ నాయక్ మాట్లాడుతూ.. టీఎస్-ఎంసెట్ కన్వీనర్‌గా యూనివర్సిటీలో కీలక పదవిలో ఉన్న వ్యక్తిని కాదు అని ఒక ఎస్టీ బంజారా సామాజిక వర్గానికి చెందిన ప్రొ. బి.డీన్‌కుమార్‌ను నియమించిన టీఎస్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రికి జేఎన్‌టీయూహెచ్ బంజారా విద్యార్థులు, విద్యార్థి సంఘం తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. సామాజిక న్యాయం జరిగిందని హర్షిస్తున్న సమయంలో కొందరు అదే పనిగా పెట్టుకొని విశ్వ విద్యాలయం ప్రతిష్ఠను దిగజార్చే పనిచేస్తున్నారని అన్నారు. ప్రొఫెసర్ డీన్ కుమార్ గతంలో చాలా సంవత్సరాలు ఎంసెట్‌లో కీలకమైన బాధ్యతలు నిర్వర్తించారని పేర్కొన్నారు. మంచి మనిషిగా సౌమ్యుడు, నిజాయితీ కలిగిన ప్రొఫెసర్‌పై బురద చల్లే ప్రయత్నం చేస్తున్న వారిని వదిలి పెట్టే ప్రసక్తే లేదని తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

రోడ్డు భద్రత వారోత్సవాలు షురూ

- నెక్సస్ మాల్‌లో ట్రాఫిక్‌పై అవేర్‌నెస్ సెషన్
- 17వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు

కూకట్‌పల్లి: నెక్సస్ హైదరాబాద్ మాల్-సైబరాబాద్ పోలీసులతో కలిసి అవగాహన సెషన్‌తో శుక్రవారం రోడ్డు భద్రత వారోత్సవాలు ప్రారంభించారు. నెక్సస్ హైదరాబాద్ మాల్ ఇటీవల సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులతో కలిసి ట్రాఫిక్ అవేర్‌నెస్ సెషన్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాల్ కస్టమర్‌లు, మాల్ రిటైల్ సిబ్బంది పాల్గొన్నారు. సెషన్‌లో నర్సింహరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీసులు పాల్గొని మాట్లాడుతూ... సెషన్ రోడ్డు భద్రత, ట్రాఫిక్ జరిమానాలు, హెచ్చరిక సంకేతాలు మోటార్ వెహికల్ యాక్ట్‌తో పాటు రియల్ లైఫ్ ఇన్సిడెంట్ వీడియోలను ప్రదర్శించారు. వారం రోజుల పాటు జరిగే అవగాహన ప్రచారంలో మరిన్ని ఆన్ గ్రౌండ్ ఎంగేజ్‌మెంట్ కార్యాకలాపాలు ఉంటాయన్నారు.

◆ ఈనెల 17 జనవరి 2022 భద్రతా వారోత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది జీవితాలు ప్రమాదంలో పడుతుండగా, సామాజిక సమస్యపై ఇటీవలి ట్రెండ్‌లలో రోడ్డు ట్రాఫిక్ ప్రమాదాలు ప్రమాదకరస్థాయిలో ఉన్నాయని తెలిపారు. దేశంలో ప్రతి రోజూ సుమారు 337 మంది ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొననారు. అందులో ఎక్కువ మందిని రెస్క్యూ వారు సకాలంలో సహాయ చర్యలతో నివారిస్తామన్నారు.

◆ ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడానికి.. ప్రమాదాల సంఘటనలను తగ్గించడానికి 12 నగరాల్లోని 17 మాల్స్‌లో నిర్వహిస్తున్నామని అందులో భాగంగా నెక్సస్ మాల్‌లో ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు జాతీయ రహదారి భద్రతా వారాన్ని పాటిస్తున్నామన్నారు.



నెక్సస్ మాల్‌లో నిర్వహించిన భద్రత వారోత్సవాల్లో పాల్గొన్న సైబరాబాద్, కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీసులు, మాల్ సిబ్బంది తదితరులు

సురక్షిత ప్రాంతాల్లో పతంగులు ఎగురువేయాలి

కూకట్‌పల్లి డీఈ చక్రవర్తి

కూకట్‌పల్లి: సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగులు ఎగరవేయటం ఒక ఆనవాయితీగా వస్తున్నది. సురక్షిత ప్రాంతాల్లో పతంగులు ఎగురువేయటం శ్రేయస్కరం అని కూకట్‌పల్లి డిఇ చక్రవర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పతంగులు ఎగురవేస్తున్న వారికి కొన్ని సూచనలు అందజేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పతంగులు ఎగరవేసినట్లయితే ఆ పతంగుల మాంజాలు విద్యుత్ లైన్లపై, ట్రాన్స్‌ఫార్మర్లపై పడి ప్రమాదాలు, విద్యుత్ అంతరాయాలు కలిగి అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.

◆ విద్యుత్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా, బహిరంగ ప్రదేశాల్లో, మైదానాల్లో మాత్రమే పతంగులు ఎగరవేయాలన్నారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల, సబ్ స్టేషన్‌ల వద్ద ఎగరవేయడం ప్రమాదకరం, ఒకవేళ పతంగుల కానీ, మాంజాలు కానీ విద్యుత్ లైన్లపై, ఇతర విద్యుత్ పరికరాలపైపడితే విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.

◆ కాటన్, నైలాన్, లినెన్‌తో చేసిన మాంజాలను మాత్రమే వాడాలన్నారు. మెటాలిక్ మాంజాలు వాడొద్దని పేర్కొన్నారు. మెటాలిక్ మాంజాలు విద్యుత్ వాహకాలు కనుక అవి లైన్లపై పడ్డప్పుడు విద్యుత్ షాక్ కలిగే అవకాశం ఉందన్నారు. పొడి వాతావరణంలో మాత్రమే పతంగులు ఎగురవేయాలని తెలిపారు. తడి వాతావరణంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ అని పేర్కొన్నారు.

◆ పతంగులు కానీ, మాంజాలు కానీ విద్యుత్ లైన్లపై ఇతర విద్యుత్ పరికరాలపై పడ్డప్పుడు వాటిని వదిలేయాలని సూచించారు. ఒకవేళ వాటిని పట్టుకు లాగినప్పుడు విద్యుత్ తీగలు ఒక దానికొకటి రాసుకొని విద్యుత్ ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. బాల్కనీ, గోడల మీద నుంచి పతంగులు ఎగురవేయొద్దని సూచించారు. పతంగులు ఎగురవేసేటప్పుడు తమ పిల్లలను గమనించాలని తల్లిదండ్రులను కోరారు. తెగిన, కింద పడ్డ విద్యుత్ వైర్లను తాకొద్దన్నారు.

◆ ఒకవేళ విద్యుత్ వైర్లపై, విద్యుత్ పరికాలపై పతంగులు, మాంజాలు తెగిపడ్డట్లు ఉంటే, విద్యుత్ వైర్లు తెగి రోడ్డుపై పడ్డట్టు ఉన్నా, వాటిని తాకకుండా వెంటనే విద్యుత్ శాఖ వారి 1912కి గానీ లేదా సమీపం విద్యుత్ కార్యాలయానికి ఫోన్ చేసి తెలిపితే, విద్యుత్ శాఖ వారు వెంటనే తగు చర్యలు తీసుకుంటారని తెలిపారు.

ప్రమాదం జరిగినప్పుడు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

భాగ్యనగర్ కాలనీ 9440813158, ఫ్యూజ్ ఆఫ్ కాల్ 9490610179, ఆల్విన్‌కాలనీ సెక్షన్ ఏఈ 9491067618, ఫ్యూజ్‌ఆఫ్ కాల్ 8331041820, కూకట్‌పల్లి సెక్షన్ ఏఈ 9440813156, ఫ్యూజ్ ఆఫ్ కాల్ 9490610177 లేదా సంస్థ మొబైల్ ఆప్ ద్వారా గాని లేదా సంస్థ వెబ్‌సైట్ ద్వారా తమకు తెలియజేయాలన్నారు.

కంటి వెలుగు కేంద్రాల్లో జెడ్‌సీ తనిఖీలు



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత కూకట్‌పల్లి జోన్ పరిధిలోని కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించే ప్రాంతాలను పరిశీలించారు. ఈనెల 18 నుంచి కంటి వెలుగు నిర్వహిస్తున్న నేపథ్యంలో శుక్రవారం కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిల్ పరిధిలోని కంటి వెలుగు ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీలు మంగతాయారు, ప్రశాంతి, ఎస్ఈ పి.చెన్నారెడ్డి, డిప్యూటి ఈఈలు, ఏఈ, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నిజాంపేట్: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నిజాంపేట్ కార్పొరేషన్ 33వ వార్డులోని సైదప్ప బస్తీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు స్థానికంగా నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, తాగు నీరు, విదుత్ సమస్యలను శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లలో మాట్లాడి పరిష్కరించే దిశగా పనుల చేపట్టాలన్నారు.

అభినందనలు



జగన్ ఫిట్‌నెస్, రన్నింగ్ కోచ్ సోమా జగన్మోహన్‌రెడ్డిని శుక్రవారం క్రీడాశాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. ఇటీవల 24 గంటల పాటు నిరంతరాయంగా స్టేడియంలో పరిగెత్తిని జగన్మోహన్‌రెడ్డిని అవార్డు అందజేశారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వం ఎల్లప్పుడు ప్రోత్సాహం అందిస్తుందని మంత్రి అన్నారు.

మూసాపేట

విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబురాలు



వేడుకల్లో పాల్గొన్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

మూసాపేట: హబీబ్‌నగర్‌లోని శ్రీ సాయి విద్యానికేతన్ స్కూలులో శుక్రవారం సంక్రాంతి పండుగ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు హరిదాసుల వేషధారణ, బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి పండుగ జరుపుకున్నామని పాఠశాల కరస్పాండెంట్ గార్లపాటి సత్యనారాయణ తెలిపారు.

వివేకానంద డిగ్రీ కళాశాలలో

కూకట్‌పల్లి: వివేకానంద డిగ్రీ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో రంగోలి, మెహందీ, ట్రెడిషనల్ ఫుడ్, ర్యాంప్‌వాక్ కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డా. కె.నరేష్ పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



అనంతరం వివేకానంద జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.వి. లావణ్య, డీన్ మానిక, ప్రిన్సిపల్ రాజేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



హరిదాసు వేషధారణలో శ్రీసాయి విద్యానికేతన్ విద్యార్థి

రెయిన్‌బో స్కూల్‌లో...

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్‌బోయిన్‌పల్లి రెయిన్‌బో కాన్సెప్ట్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నాంటాయి. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు రంగవల్లులను తీర్చిదిద్దారు. సంప్రదాయ దుస్తువులలో గొబ్బెమ్మలను పెట్టి, భోగి పళ్లను పోసి భోగి మంటలను పెట్టి సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. హరిదాస్ కీర్తనలు, పతాంగుల విన్యాసాలతో అలరించారు. పాఠశాల చైర్మన్ నాగూర్‌బాబు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ నర్సింహయాదవ్ మాట్లాడుతూ... పండగ విశిష్టత తెలిపేలా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ దివ్యభారతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్

భాగ్యనగర్‌కాలనీ: నిజాంపేట్ రోడ్డులోని శ్రీకొలను నారాయణ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో కళాసిల్క్ హ్యాండ్లూమ్ ఇండియా ఎగ్జిబిషన్ వినియోగదారులతో సందడిగా మారింది. ఈ ఎగ్జిబిషన్‌లో వివి రాష్ట్రాలకు చెందిన ప్రఖ్యాతి గాంచిన కళాకారులచే తయారు చేయబడిన వస్తువులు, గృహోపకరణాలు, చేనేత కళాకారులతో చేయబడిన కాటన్ చీరలు, చేనేత వస్త్రాలు అందుబాటులో ఉంచామని నిర్వాహకుడు వినోద్ తెలిపారు. ఎగ్జిబిషన్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా పలు ఆఫర్లు ఇస్తున్నట్లు తెలిపారు. వివిధ రకాల చేనేత బెడ్ షీట్లు, కవర్లు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఎగ్జిబిషన్ సంక్రాంతి వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు.



నిజాంపేట్ రోడ్డులోని కళాసిల్క్ ఎగ్జిబిషన్‌లోని వస్త్ర దుకాణం



ముగ్గులను తిలకిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

ముగ్గుల పోటీలు..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు ఆధ్వర్యంలో శుక్రవారం కూకట్‌పల్లిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ముగ్గులను తిలకించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

చిన్నారిని హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు

కూకట్‌పల్లి: మూడేళ్ల చిన్నారికి ఉరివేసి హత్య చేసిన ఘటనలో నిందితుడికి జీవిత ఖైదును విధిస్తూ కూకట్‌పల్లి, మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా 3వ అడిషనల్ జడ్జి కె. కళ్యాణ్ చక్రవర్తి శుక్రవారం తుదితీర్పును వెలువరించారు. కేసు వివరాల్లోకి వెళితే కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జేఎన్‌టియు బస్‌స్టాప్ వద్ద గుడిసెల్లో నివసించే జొక్క రాణి తన భర్త చింతయ్యను వదిలేసింది. తన ముగ్గురు పిల్లలు పూజిత, అభిషేక్, చైతన్య అలియాస్ జిజ్జులు (3)లతో కలిసి మోహన్ సూరుటి (35)తో నివసిస్తోంది. అయితే 21వ తేదీ మార్చి 2015 సంవత్సరం ఉదయం 10 గంటలకు చిన్నారి చైతన్య అలియాస్ జిజ్జులుకు ఉరివేసి మోహన్ హత్య చేశాడు. అనంతరం ఆమె తల్లి జొక్క రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పర్చగా సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి జీవిత ఖైదుతో పాటు 5 వేల జరిమాన విధించారు.

స్వచ్ఛ భారత్ అభియాన్.. కైట్ ఫెస్టివల్



స్వచ్ఛభారత్ అభియాన్ ఆధ్వర్యంలో పతంగులు పంపిణీ చేస్తున్న మాధవరం కాంతారావు



కేపీహెచ్‌బీ కట్టావారి సేవా కేంద్రంలో పతంగులను పంపిణీ చేస్తున్న నర్సింగరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో శుక్రవారం కైట్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేపీహెచ్‌బీ టెంపుల్ బస్‌స్టాప్, ఆల్విన్‌కాలనీ, దయార్‌గూడ ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో కూకటపల్లి స్వచ్ఛభారత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాధవరం కాంతారావు హాజరై బస్తీలోని చిన్నారులకు గాలి పటాలు ఉచితంగా అందజేశారు. అనంతరం అందరితో కలిసి గాలి పటాలను ఎగరవేశారు.

చైనా ఉత్పత్తులను వాడొద్దు...

◆ ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ.. మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందిరిపై ఉందన్నారు. పతంగల పండుగ కులమతాలకు అతీతంగా జరుపుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. పండుగ సందర్భంగా చైనా ఉత్పత్తులను కాకుండా మన దేశీయ ఉత్పత్తులను వినియోగించాలని కోరారు. అప్పుడే ×లోకల్ ఫర్ వోకల్‌≈ని నాదాన్ని ముందుకు తీసుకెళ్లగలమని కాంతారావు పిలుపునిచ్చారు.

కట్టావారి సేవా కేంద్రం ఆధ్వర్యంలో...

◆ కేపీహెచ్‌బీ రమ్యాగ్రౌండ్స్ వద్ద కట్టావారి సేవా కేంద్రంలో శుక్రవారం సంక్రాంతి పండుగ పురస్కరించుకొని చిన్నారులకు ఉచితంగా పతంగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రం వ్యవస్థాపకుడు కట్టా నర్సింగరావు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం చిన్నారులకు ఉచితంగా పతంగులు పంపిణీ చేస్తున్నామన్నారు. సంక్రాంతి పండుగ అంటేనే పతంగుల పండుగని పేర్కొన్నారు. నింగికి నిచ్చెన వేసినట్లుగా గాలి పటాలను ఎగరేస్తూ సంతోషంగా జరుపుకునే పండగ అని అన్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి 500 పతంగులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొల్లా శంకర్, ఆతోట శివరామకుమార్, వాసిరెడ్డి లక్ష్మీనారాయణ, పబ్బినీడి తిరుపతి రావు, కట్టా సృజన్ తేజ పాల్గొన్నారు.